సీఎంవో కొత్త డైవర్షన్ డ్రామా!

- వ్యక్తిగత విదేశీ పర్యటనకు 18 కోట్ల ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేశాననడం పచ్చి అబద్ధం
- ఆయా మీడియాలకు డిఫమేషన్ నోటీసులిస్త
- నాటి ఐటీ మంత్రి కేటీఆర్ బృందంతో కలిపి డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా విదేశాలకు వెళ్లాం
- పర్యటనల ఖర్చు అంతా ఐటీశాఖ చెల్లించింది
- ఇందులో డిజిటల్ మీడియా నిధులు వాడలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్నందునే 15 నెలల పాలనలో 11 అక్రమ కేసులు పెట్టారు
- ఇప్పుడు వ్యక్తిత్వ హననానికి దిగారు: కొణతం దిలీప్

కొణతం దిలీప్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అవినీతి, అరాచక పాలనను ప్రశ్నిస్తున్నందునే తనపై రేవంత్ సర్కారు కత్తిగట్టి వేధింపులకు పాల్పడుతున్నదని ప్రభుత్వ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ దిలీప్ కొణతం ఆరోపించారు. ఇప్పటికే 11 అక్రమ కేసులు పెట్టి, అరెస్టులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వ్యక్తిత్వ హననానికి దిగిందని మండిపడ్డారు. తన వ్యక్తిగత విదేశీ పర్యటనలకు సుమారు రూ.18 కోట్ల ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసినట్టు కొత్త డైవర్షన్ డ్రామాకు సీఎం కార్యాలయం తెరలేపిందని ఆరోపించారు. ఆ వార్త పచ్చి అబద్ధమని, తనపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తను ప్రచురించాయని ఆక్షేపించారు. వాటికి పరువు నష్టం కింద నోటీసులు పంపించనున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా నాటి ఐటీ మంత్రి కేటీఆర్ బృందంతో కలిసి పదేండ్లలో (2014-2023) తొమ్మిది సార్లు విదేశాలకు వెళ్లామని, అవన్నీ పెట్టుబడుల ఆకర్షణ కోసం జరిగిన అధికారిక పర్యటనలేనని, ఒక్కటి కూడా వ్యక్తిగతమైనది కాదని స్పష్టంచేశారు. ఈ పర్యటనలకు అయిన ఖర్చు అంతా ఐటీశాఖ అధికారికంగానే చెల్లించిందని, ఇందులో డిజిటల్ మీడియా నిధులు ఒక్కపైసా కూడా వినియోగించలేదని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నాటి ఐటీ మంత్రి కేటీఆర్ అధికారిక విదేశీ పర్యటనల వివరాలు ప్రజాబాహుళ్యంలోనే ఉన్నాయని, వివరాలు, ఫొటోలు ఎప్పటికప్పుడు కేటీఆర్ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు అయ్యాయని, ప్రజలకు తెలిసిన సమాచారాన్ని ఏదో కొత్తగా కనుగొన్నట్టు కొన్ని పత్రికలు వార్తగా ప్రచురించడం శోచనీయమని మండిపడ్డారు.

ఉద్దేశపూర్వకంగా అల్లిన కథనం

'1) కొణతం దిలీప్ విదేశీ పర్యటనల వివరాలు 2) గత ప్రభుత్వ డిజిటల్ మీడియా విభాగం మొదటి నుంచి పెట్టిన ఖర్చు వివరాలు విడివిడిగా ఇవ్వాలని 2024 నవంబర్‌లో కాంగ్రెస్ కార్యకర్త ఆర్టీఐ పిటిషన్‌లో కోరారు. ఆగస్టు 2016 నుంచి డిసెంబర్ 2023 వరకు డిజిటల్ మీడియా విభాగానికి ప్రభుత్వం పెట్టిన ఖర్చు సుమారు రూ.18 కోట్లు అని తెలంగాణ ఐటీశాఖ జవాబు ఇచ్చింది. డిజిటల్ మీడియా విభాగం చేసిన అన్ని పనులకు చెల్లించిన సొమ్ము, జీతభత్యాలు, ఇతర ఖర్చులు అన్నీ కలిపితే సుమారు రూ.18 కోట్లు. కానీ, ఎలాంటి సంబంధం లేని అధికారిక విదేశీ పర్యటనలకు, డిజిటల్ మీడియా మొత్తం ఖర్చుకు లింక్ పెట్టి కొన్ని పత్రికలు తప్పుడు వార్తలు ప్రచురించాయి. ఆర్టీఐ పిటిషనర్‌కు ఇచ్చిన సమాధానంలో దిలీప్ విదేశీ పర్యటనల ఖర్చును డిజిటల్ మీడియా వింగ్ భరించలేదని స్పష్టంగా ఉన్నది. కానీ, కొన్ని పత్రికలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అబద్ధపు వార్తను ప్రచురించాయి. ఓ పత్రిక అయితే, ఒక్క బ్రిటన్ పర్యటనకే రూ.13.85 కోట్లు దిలీప్ ఖర్చు చేసినట్టు, వాస్తవాన్ని నిర్ధారించుకోకుండా కథనం అచ్చేసింది. డిజిటల్ మీడియా విభాగానికి 2023లో అత్యధిక మొత్తం ఖర్చు కావడానికి ప్రత్యేక కారణం ఉన్నది. మే 2023లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అప్పటి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా వివిధ శాఖలు పదేండ్లలో సాధించిన విజయాలను ప్రధాన స్రవంతి మీడియా, డిజిటల్ మీడియాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ మీడియా విభాగం నుంచి ప్రత్యేక వీడియోల రూపకల్పన, వెబ్‌సైట్, మొబైల్ యాప్, ఇంకా డిజిటల్ మీడియా సంస్థలకు ప్రకటనలు ఇవ్వడం, డజన్ల కొద్దీ ప్రత్యేక వీడియోలు, డాక్యుమెంటరీలు రూపొందించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాలశాఖ ప్రత్యేక బడ్జెట్ కూడా కేటాయించింది. అందువల్లే 2023లో డిజిటల్ మీడియా విభాగానికి అధిక నిధులు ఖర్చయ్యాయి. 'ఈ దశాబ్ది ఉత్సవాల నిధుల విడుదల, వ్యయానికి సంబంధించిన అన్ని ప్లైళ్ల పరిశీలన, ఆమోదం ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో జరిగాయి. సదరు నిధుల వినియోగం గురించి ఈ ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తుకు ఆదేశించినా ఎదుర్కోవడానికి నేను సిద్ధమే' అని కొణతం దిలీప్ ఆ ప్రకటనలో స్పష్టంచేశారు.

శ్రీరాం కర్రిని ఏ హోదాలో తీసుకెళ్లారు?

జనవరి 2024లో సీఎం రేవంత్‌రెడ్డి తన వెంట ఎటువంటి ప్రభుత్వ హోదా లేని శ్రీరాం కర్రి అనే వ్యక్తిని ప్రభుత్వ సొమ్ముతో దావోస్‌తోపాటు ఇంకో మూడు దేశాలకు ఎందుకు తీసుకువెళ్లారు? అని ఒక పౌరుడు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద అడిగిన ప్రశ్నకు 14 నెలలు గడిచినా సమాధానం రాలేదు. ఆనాటికి ఒక ప్రైవేటు వ్యక్తి అయిన శ్రీరాం కర్రిని ఎందుకు ప్రభుత్వ ఖర్చుతో నాలుగు దేశాలు తిప్పారు? ఏం దాచటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది? పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం డిజిటల్ మీడియాకు ఖర్చు చేసిన దానికంటే రెట్టింపు ఖర్చు కేవలం ఏడాదిన్నరలో రేవంత్ ప్రభుత్వం ఖర్చు చేసిన మాట వాస్తవం కాదా? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

ఉత్తమ్ క్షమాపణ చెప్తవా?

> కృష్ణా నదిలో 1020 టీఎంసీలు వస్తే 34శాతం వాటా ప్రకారం కూడా వాడాల్సిన నీళ్లను వాడలేదు. కానీ ప్రగతి భవన్‌లో చంద్రబాబు నాయుడుకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికి, గురుదక్షిణ కింద తెలంగాణకు రావాల్సిన 80 టీఎంసీల కృష్ణా నీళ్లను ఆంధ్రాకు అప్పగించింద్రు. అసలు ఆంధ్రాకు 80 టీఎంసీలు అదనంగా నీళ్లివ్వడమేమిటి? ఇప్పుడు 34 శాతం నీటి వాటా గురించి మాట్లాడుతున్నరు. మరి ఉన్న నీటిని వాడే తెలివి ఎందుకు లేదు? – అసెంబ్లీలో హరీశ్ నిప్పులు

- తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ ఇచ్చిన లేఖ అబద్ధమా?
- కాంగ్రెస్‌కు కృష్ణా వాటా వాడకం కూడా చేతకాదా?
- చంద్రబాబుకు గురుదక్షిణ కింద ఏపీకి 80 టీఎంసీల నీళ్లు అప్పగించింద్రు
- ప్రాజెక్టులు ఎండబెట్టి తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌ను నిలదీసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని, ప్రత్యామ్నాయం చూసుకోవాలని సీడబ్ల్యూసీ ఇచ్చిన సలహా లెటర్ తమ వద్ద ఉన్నదని.. దాన్ని ఉత్తమ్‌కు చూపిస్తానని, తాను చెప్పేది నిజమైతే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్షమాపణ చెప్తారా? అని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు నిలదీశారు. బుధవారం అసెంబ్లీలో ఇరిగేషన్ పద్దులపై హరీశ్ మాట్లాడారు. ఇరిగేషన్‌పై మాట్లాడేందుకు తమకు పూర్తిగా అవకాశమివ్వలేదని వాపోయారు. ఇరిగేషన్ విషయంలో తమపై స్వీపింగ్ రిమార్క్స్ చేశారని మండిపడ్డారు. వాటిపై స్పష్టత ఇచ్చి రికార్డును సెట్ చేసే బాధ్యత తమపై ఉన్నదని స్పష్టంచేశారు. ఇరిగేషన్‌పై చిన్న చర్చ అయినా పెట్టి ప్రజలకు నిజానిజాలు తెలపాలని సూచించారు. 'మంత్రి ఉత్తమ్‌కు ఆవేశం తగదు.. అసత్యాలను మీరు గంటలు గంటలు చెప్పినా వాస్తవాలను చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నం' అని స్పష్టం చేశారు. 'నిరుడు ఇరిగేషన్ పద్దుల్లో కొత్తగా 6 ప్రాజెక్టులు పూర్తి చేస్తం.. ఆరు లక్షల ఎకరాల అయకట్టుకు నీళ్లిస్తమని చెప్పింద్రు. కొత్తగా ఎన్ని ప్రాజెక్టులు కట్టింద్రు? ఎన్నెకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లిచ్చిండ్రో మంత్రి ఉత్తమ్ స్పష్టత ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

కృష్ణా వాటా వాడకంలో కాంగ్రెస్ చేతగాని తనం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ ముందు సరిగ్గా వాదనలు వినిపించకపోవడం వల్ల కృష్ణా నదిలో 299 టీఎంసీలు తెలంగాణకు, 512 టీఎంసీలు ఆంధ్రాకు కేటాయించిందని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కేంద్రం, ట్రిబ్యునల్ వద్దకు వెళ్లినట్టు గుర్తుచేశారు. అప్పుడవి తాత్కాలిక కేటాయింపులేనని చెప్పారని గుర్తుచేశారు. ఈ సంవత్సరం కృష్ణాలో 1,020 టీఎంసీల నీళ్లు వచ్చాయని వెల్లడించారు. 66:34 ప్రతిపాదనల ప్రకారం తెలంగాణకు 346 టీఎంసీలు రావాల్సి ఉన్నదని.. కానీ ఈ ప్రభుత్వం 266 టీఎంసీలనే వాడిందని మండిపడ్డారు. తెలంగాణకు 34 శాతం కేటాయింపులు ఉంటే కేవలం 27% నీటినే వాడుకున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతగానితనం వల్ల తెలంగాణ కృష్ణా వాటాను కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్డీఎస్‌లో 15.9 టీఎంసీలుంటే 5.65 టీఎంసీలే వాడారని, భీమా లిఫ్ట్ ఇరిగేషన్ కింద 20 టీఎంసీల నీటి అలకేషన్ ఉంటే కేవలం 8.63 టీఎంసీలే వాడారని మండిపడ్డారు.

మేడిగడ్డ బరాజ్ వద్దని సీడబ్ల్యూసీ చెప్పలేదు

'మీకు సరిపడా నీళ్లు లేవు కాబట్టి ప్రత్యామ్నాయం చూసుకోవాలని సీడబ్ల్యూసీ ఇచ్చిన లెటర్ మా దగ్గర ఉన్నది. నేను చెప్పింది నిజమైతే ఉత్తమ్ క్షమాపణ చెప్పాలె. ఒక వేళ మంత్రి చెప్పిందే నిజమైతే నేను క్షమాపణ చెప్తా' అని హరీశ్ సవాల్ విసిరారు. ఫైవ్‌మెన్ కమిటీ రిపోర్ట్ మేడిగడ్డ వద్ద బారాజ్ కట్టొద్దు అని చెప్పినట్టు మంత్రి ఉత్తమ్ చెప్తున్నారని, ఆ కమిటీ మేడిగడ్డ నుంచి మిడ్ మానేరుకు డైరెక్ట్ లిఫ్ట్ సాధ్యం కాదని మాత్రమే చెప్పిందని స్పష్టంచేశారు. మేడిగడ్డ వద్ద బరాజ్ కట్టొద్దని ఫైవ్ మెన్ కమిటీ చెప్పలేదని వివరించారు. 'పోతిరెడ్డిపాడు కట్టిన నాడు మా మంత్రి పదవులను త్యాగం చేసి నాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసినం. పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు తీసుకుపోతుంటే పదవుల కోసం పెదవులు మూసుకున్నది మీరు కాదా?' అని ప్రశ్నించారు. తమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీలు లేవని స్పష్టంగా సీడబ్ల్యూసీ చెప్పిందని, కట్ మోషన్స్‌పై మంత్రి స్పష్టమైన సమాధానం చెప్పలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు రూ.1,260 కోట్లను తామే చెల్లించామని, కోర్టు ఆర్డర్ల ద్వారా దాదాపు రూ.200 కోట్లు ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల ప్రాజెక్టుల కింద కాలువల నిర్మాణం కాకపోవడం వల్ల ఆయకట్టు రావడం లేదని, ఆ కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తారా? లేదా? చెప్పాలని నిలదీశారు.

బీజేపీ సభ్యుల మాటలను ఖండిస్తున్నం

బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. శాసనసభలో బీజేపీ సభ్యుల మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, సెంట్రల్ వాటర్ కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాయని గుర్తుచేశారు. ఒక వేళ తమ్మడిహట్టి వద్ద నీళ్లు ఉండి ఉంటే తమకు కాళేశ్వరం కట్టుకోడానికి అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం సరైంది కాకపోతే ఆ రోజు ప్రాజెక్టుకు 16 మంది సీడబ్ల్యూసీ డైరెక్టరేట్లు ఎలా అనుమతి ఇచ్చారని నిలదీశారు.

చంద్రబాబుకు గురుదక్షిణగా కృష్ణా నీళ్లు

అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ సమాధానం చెప్పలేదని హరీశ్ చెప్పారు. కృష్ణాలో మన తాత్కాలిక కేటాయింపు 34 శాతమని, ఈ నీళ్లను కూడా వాడలేక పోయిన దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్‌ది అని నిప్పులు చెరిగారు. ప్రగతి భవన్‌లో చంద్రబాబు నాయుడుకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికి గురుదక్షిణగా తెలంగాణకు రావాల్సిన 80 టీఎంసీల కృష్ణా నీటిని ఆంధ్రాకు అప్పగించారని దుమ్మెత్తిపోశారు. ఓవైపు తెలంగాణలో పంటలు ఎండిపోతుంటే ఆంధ్రాకు 80 టీఎస్‌సీల నీటిని అదనంగా ఎలా ఇస్తారని మండిపడ్డారు. కృష్ణాలో 80 టీఎంసీలు తక్కువగా వాడి, ఆంధ్రాకు అప్పజెప్పి.. తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఘాటుగా విమర్శించారు. ఈ విషయంపై సభలో మాట్లాడుదామంటే మైకు ఇవ్వకుండా పూర్తిగా బుల్డోజ్ చేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సభ జరిగిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

కేటీఆర్‌పై ఒకే స్టేషన్‌లో మూడు కేసులు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏ1గా కేటీఆర్ పేరు నమోదు
- మరో రెండు కేసుల్లో ఏ2, ఏ3గా నమోదు
- క్రిశాంక్, కొణతం దిలీప్, తెలుగు స్క్రైబ్, మిర్రర్ టీవీ, టీన్యూస్‌పై కూడా..
- నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో మూడు ఫిర్యాదుల మేరకు మూడు ఎఫ్ఐఆర్‌లు
- ఆదేశించిన కాంగ్రెస్ నేతలు.. పాటించిన పోలీసులు?

నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తదితరులు

నల్లగొండ, మార్చి 26 (నమస్తే తెలంగాణ)/నేరేడుచర్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో మూడు వేర్వేరు ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు మంగళవారం మూడు కేసులు నమోదు చేశారు. ఈ మూడు కేసుల్లోనూ ఒక్కో కేసులో ఒక్కొక్కరిని ఏ1గా పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను వర్తింపచేస్తూ నమోదు చేసిన కేసులో కేటీఆర్‌ను ఏ1గా చేర్చారు. మూడు కేసుల్లోనూ కేటీఆర్‌తోపాటు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌ను నిందితులుగా చేర్చారు. ఒక కేసులో తెలుగు స్క్రైబ్‌ను, మిర్రర్ టీవీని, మరో కేసులో టీన్యూస్ యజమాన్యాన్ని, తెలుగు స్క్రైబ్‌ను కలిపి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్‌లో పదో తరగతి పరీక్ష మాల్ ప్రాక్టీస్ కేసు వ్యవహారంలో పోలీసులు ఇద్దరు మైనర్లతోపాటు 11 మంది నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులోని కీలక నిందితులు స్థానిక అధికార పార్టీ నేతల అనుచరులు అంటూ వారు వివిధ సందర్భాల్లో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఇతర నేతలతో సన్నిహితంగా దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వీటిని పలు వెబ్‌సైట్లతో పాటు యూట్యూబ్ చానళ్లు ఫొటోలతో సోషల్ మీడియాలో ప్రచురించాయి. ఓ వెబ్ న్యూస్ సంస్థ ప్రచురించిన కథనం ఆధారంగా పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపేలా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. నిందితులతో తమకు సంబంధం లేకున్నా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ అధికార పార్టీ నేతలు పోలీస్‌స్టేషన్ మెట్టు ఎక్కారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, కాంగ్రెస్‌నేత ఉగ్గిడి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నకిరేకంటి నరేందర్ ఒకే విషయంలో వేర్వేరుగా ఫిర్యాదులు ఇచ్చారు. తమ పరువుకు భంగం కలిగిందని, తమ సామాజికవర్గంలో తమను తప్పుగా చూసే ప్రమాదం ఉందని, అందుకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా వేర్వేరు ఫిర్యాదుల వెనుక స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పకడ్బందీ ప్లాన్ ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఆ ప్రకారమే పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేస్తూ ఒక్కో కేసులో ఒక్కొక్కరిని ఏ1గా ఉండేలా చర్యలు తీసుకున్నారని చెప్తున్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులు దుర్మార్గం : చిరుమర్తి లింగయ్య

పదో తరగతి పేపర్ పరీక్ష నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నాయకులు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌కుమార్‌పై పెట్టిన అక్రమ కేసులు దుర్మార్గమని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీవ్రంగా ఖండించారు. అక్రమ కేసులతో గొంతు నొక్కాలని చూస్తే అంతకు రెట్టింపు స్వరంతో ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన నిలదీయడం ఖాయమని హెచ్చరించారు. బుధవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో చిరుమర్తి మాట్లాడారు. నకిరేకల్‌లో పదో తరగతి పరీక్షల తొలి రోజే పేపర్ లీక్ చేసే కుట్రలకు స్థానిక స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులు తెరలేపారని, ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యంతో కుమ్మక్కై భారీ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఇది బహిర్గతమై రచ్చకెక్కడంతో దాన్ని కప్పిపుచ్చేందుకు బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

కేటీఆర్‌పై నమోదైన కేసుల వివరాలు

ఫిర్యాదుదారు	ఎఫ్ఐఆర్	సెక్షన్లు	నిందితులు
రజిత	85/2025	బీఎన్ఎస్ 353(1)(C), 353(2)	ఏ1- క్రిశాంక్, ఏ2- కేటీఆర్, ఏ3- కొణతం దిలీప్
శ్రీనివాస్	86/2025	బీఎన్ఎస్ 353(1)(C), 353(2)	ఏ1-కొణతం దిలీప్, ఏ2-క్రిశాంక్, ఏ3-కేటీఆర్, ఏ4 -తెలుగు స్క్రైబ్ ఎండీ, ఏ5- మిర్రల్ టీవీ ఎండీ
నరేందర్	87/2025	బీఎన్ఎస్ 353(1)(C), 353(2),	ఏ1-కేటీఆర్, ఏ2-దిలీప్, 3(1)(యూ) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ఏ3- టీన్యూస్, స్క్రైబ్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కేటీఆర్‌పై పెట్టినవి చిల్లర కేసులు

- కాంగ్రెస్ సర్కారు పనితీరుతో ప్రజలు విసిగిపోయారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శ

నేరేడుచర్ల, మార్చి 26 : కేటీఆర్, క్రిశాంక్, కొణతం దిలీప్‌పై పోలీసులు పెట్టినవి చిల్లర కేసులని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో బుధవారం అనంతరం మీడియాతో మాట్లాడారు. పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించడం చేతగాని ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడుతున్నదని మండిపడ్డారు. హామీలను అమలు చేయలేక, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నదని దుయ్యబట్టారు. నకిరేకల్‌లో జరిగిన పదోతరగతి పేపర్ లీకేజీ కేసులో నిందితులను పట్టుకోవడం కంటే, బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయటానికి శ్రద్ధ ఉందని మండిపడ్డారు. కేటీఆర్‌ను తొందరగా అరెస్టు చేయాలనే భ్రమలో కాంగ్రెస్ ప్రభుత్వమున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర వేషాలు మానుకోవాలని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మా జీ ఎంపీ బడుగుల లింగయ్య యా దవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒం టెద్దు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌పై బండి వ్యాఖ్యలు అసందర్భం

- సీఎం రేవంత్ చేతిలో తోలుబొమ్మలా బండి
- బీఆర్ఎస్ నేత దాసోజు ధ్వజం

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు అసందర్భమని ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతిలో బండి సంజయ్ తోలుబొమ్మలా మారిపోయారని పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచేందుకు సహకరించిన రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ కృతజ్ఞతాపూర్వకంగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకుడిగా కాకుండా కాంగ్రెస్ నేతల మాటలను బండి సంజయ్ పలుకుతున్నారని మం డిపడ్డారు. రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన త్యాగాలను ఎలాంటి రాజకీయాలు చెరిపేయలేవని హెచ్చరించారు.

దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువు

- రాష్ట్ర ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): క్రైస్తవ మత పెద్దలు పాస్టర్ ప్రవీణ్ పగడాల, అడ్వకేట్ ఇజ్రాయెల్ హత్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తున్నట్టు తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్ మండిపడ్డారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పాస్టర్ మరణాన్ని ఏపీలోని కూటమి సర్కారు రోడ్డుప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తడి లేకుండా దర్యాప్తు చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ సాల్మోన్‌రాజు, రిటైర్డ్ జడ్జి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ!

స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, వొడితెల, పెద్ది

సభా ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, సతీశ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి తదితరులు

హనుమకొండ సబర్బన్, మార్చి 26 : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సభను హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, హుస్నాబాద్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎల్కతుర్తిలో పర్యటించారు. సిద్దిపేట రోడ్డుకు ఇరువైపులా స్థలాలను పరిశీలించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సభ ఏర్పాట్లు మొదలుకొని, పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని వినయ్‌భాస్కర్ సూచించారు. చరిత్రాత్మకమైన ఈ మహా సభకు స్థానిక ప్రజలతో పాటు రైతులు సహకరించాలని కోరారు. సభకు వచ్చే పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు ఉండేలా నిత్యం పర్యవేక్షించాలని కార్యకర్తలను కోరారు. సర్వేయర్లతో డ్రోన్ల ద్వారా ప్రతిపాదిత స్థలాన్ని చిత్రీకరించి మ్యాపింగ్ చేయించారు.


ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కుకుడలో బీఆర్ఎస్‌లో చేరిన గ్రామ యువకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ప్రజలంతా కేసీఆరే మళ్లీ సీఎం కావాలనుకుంటున్నరు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కుకుడలో 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిక

బెజ్జూర్, మార్చి 26 : హామీల